01ATP10_01ATP10.qxd 10-01-2026 PM 10:51 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 11 జనవరి 2026 పేజీలు : 04


# పండుగలా వేమన జయంత్యుత్సవాలు

- రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరండి
- జయంతి ఉత్సవాల లోగోను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- ఎమ్మెల్యే కందికుంటకు అభినందనలు



లోగోను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

**కదిరి, జనవరి 10 ప్రభాతవార్త**

మానవీయ విలువలను తన పద్యాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన ఆధ్యాత్మిక, సంఘసంస్కర్త, ప్రజా కవి వేమన జయంత్యుత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం ఉదయం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వేమన రాష్ట్ర స్థాయి జయంతోత్సవాల లోగోను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ సత్య సాయి జిల్లా కదిరి తాలూకా కటారుపల్లి వేమన సమాధి వద్ద జరిగే ఈ ఉత్సవాలు ప్రజల ఆలోచనా విధానంలో గొప్ప మార్పు తీసుకొస్తాయన్నారు. కదిరి చరిత్రలో గుర్తుండిపోయేలా పండుగలా ఉత్సవాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వేంకటప్రసాద్ మాట్లాడుతూ.. వేమన కుల, మతాలకు అతీతంగా మనుషుల ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు పద్య ప్రక్రియను ఆయుధంగా ప్రయోగించారన్నారు. అతిరథ మహారథులైన విద్య, కళా, రాజకీయ, సామాజిక, సాహితీ రంగాల మేధావులు వేమన ఉత్సవాలకు హాజరవుతున్నారని, రాష్ట్రం నలుమూలల నుంచి అన్ని వర్గాల ప్రజలు, ప్రతినిధులు వేల సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో సాహితీ పరిశోధకుడు డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్, గాయకుడు మదిగుబ్బ (సుధాకర్ ఈటీవీ పాడుతా తీయగా ఫేమ్), ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు పట్నం రమణ, ఏఐ డెవలపర్ తేజస్విని, ఫ్రంట్ ఎండ్ డెవలపర్ గౌతమి పాల్గొన్నారు.

# అస్మిత ఖేలో ఇండియా-ఉమెన్స్ టెన్నిస్ బాల్ క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవం






కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపి అంబికా, క్రికెట్ టీం సభ్యులతో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

**అనంతపురం, జనవరి 10 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం నగరంలోని ఆర్డీటి స్టేడియంలో అస్మిత ఖేలో ఇండియా-ఉమెన్స్ టెన్నిస్ బాల్ క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవానికి అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై అట్టహాసంగా ప్రారంభించారు. అనంతపూర్ జిల్లా మార్కెట్ యార్డ్ చైర్మన్ బల్ల పల్లవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.ప్రసాద్, ఆర్గనైజింగ్ స్టేట్ సెక్రటరీ రవి, జిల్లా కార్యదర్శి అన్వర్ బాషా, రాకెట్ బాల్ రాష్ట్ర ప్రధాన అధ్యక్షులు షైక్ షాహిదా తదితరులు పాల్గొన్నారు. అనంతపురం, సత్యసాయి, తిరుపతి, చిత్తూరు, గుంటూరు, తూర్పు గోదావరి, కడప, అన్నమయ్య, ప్రకాశం, నెల్లూరు, ఎన్.టి.ఆర్ జిల్లాల నుంచి వచ్చిన మహిళా క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌ను మరింత ఉత్సాహంగా మార్చారు. క్రీడలు విద్యతో పాటు ఉపాధికి దోహదపడతాయి. క్రీడల్లో ప్రతిభకు ప్రభుత్వ గౌరవం ఉంటుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రత్యేకంగా మహిళలు క్రీడల్లో మరింత ముందుకు రావాలని పిలుపునిచ్చాను.

# భారీగా పెరిగిన కొబ్బరి బొండాలు, టెంకాయలు, ఎండు కొబ్బరి ధరలు



- ఒక కొబ్బరి బొండం రూ.50, కొబ్బరి కాయ రూ.45, ఎండు కొబ్బరి కిలో రూ.300
- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి కొబ్బరి నీళ్లు తాగించలేని పరిస్థితులు
- దేవున్ని దర్శించుకొని కొబ్బరి కాయ కొట్టడానికి కూడా ఆలోచించక తప్పని స్థితి
- వంటకాల్లో ఎండు కొబ్బరి వినియోగాన్ని తగ్గిస్తున్న సామాన్య మధ్యతరగతి ప్రజలు

**ఉరవకొండ, జనవరి 10 ప్రభాతవార్త**

కొబ్బరి బొండాలు, కొబ్బరి కాయలు, ఎండు కొబ్బరి ధరలు భారీగా పెరుగడంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు సతమతమవుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నేడు బహిరంగ మార్కెట్‌లో ఒక కొబ్బరి బొండం ధర 50 రూపాయలు ఉండగా టెంకాయ ధర 45 రూపాయలుగానూ, కిలో ఎండు కొబ్బరి ధర 300 రూపాయలుగా ఉంది. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి కూడా కొబ్బరి బొండం కొని తాగించలేని, దేవున్ని దర్శించుకొని టెంకాయ కొట్టలేని, కూరలు, పచ్చళ్లలో ఎండు కొబ్బరిని వినియోగించలేని పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే....





కొబ్బరి బొండంలోని నీటిలో ఎన్నో పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలు ఉండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం సహజంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తక్షణ శక్తి కోసం అందించడం జరుగుతూ వస్తోంది. అయితే దాదాపు ఏడాది కాలం క్రితం వరకు 25 నుంచి 30 రూపాయల మధ్య ఉన్న కొబ్బరి బొండం ధర నేడు ఏకంగా 50 రూపాయలకు చేరుకొని రోగులకు అందుబాటులో లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఒక లీటరు కొబ్బరి నీళ్లు 150 రూపాయలకు పైగానే ధర పలుకుతోంది. కొబ్బరి కాయల విషయానికొస్తే ఒక కొబ్బరి కాయ రిటైల్ ధర 45 రూపాయలుగా ఉంది. శుభ, అశుభ కార్యాలు ఏవైనా కొబ్బరి కాయ కొట్టడం ఆనవాయితీగా వస్తుండగా నేడు కనీసం ఆలయాల్లో దేవున్ని దర్శించుకొని కొబ్బరి కాయ కొట్టడానికి కూడా సామాన్య మధ్యతరగతి ప్రజలు పలుమార్లు ఆలోచించే పరిస్థితులు నెలకొన్నాయి. అనేక మంది కొబ్బరి కాయ లేకుండా పూలు, పండ్లు, అగరొత్తులతోనే దైవ దర్శనానికి వెళుతున్నారు. ఏడాది క్రితం వరకు కొబ్బరి కాయ ధర 20 నుంచి 30 రూపాయలు మధ్యనే ఉండగా నేడు చుక్కలనంటుతోంది. ఇక ఎండు కొబ్బరి ధరను ఒకసారి పరిశీలిస్తే ఇదివరకు కిలో 200 రూపాయల వరకు ఉండగా ఇప్పుడు 280 నుండి 300 రూపాయలు పలుకుతోంది. దీంతో పేద మధ్యతరగతి ప్రజలు కూరల మసాలాలు, పచ్చళ్లలో కొబ్బరిని వినియోగించడమే మానేసే పరిస్థితులు నెలకొన్నాయి. ఇదివరకు భోజన శాలలు, టిఫిన్ సెంటర్లలో కొబ్బరి చెట్నీ, పచ్చళ్లను ప్రత్యేకంగా వడ్డించడం జరుగుతుండగా నేడు వాటి ఊసే లేకుండా పోతోంది. కొబ్బరి బొండాలు, టెంకాయలు, ఎండు కొబ్బరి ధరలు పెరగడానికి కారణాలను పరిశీలిస్తే ప్రకృతి వైపరీత్యాలతో కొబ్బరి దిగుబడులు తగ్గడం, రవాణా ఖర్చులు పెరగడం, డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి లేకపోవడమే కారణమని పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కువగా కొబ్బరి సాగు ఉభయ గోదావరి జిల్లాల్లో జరుగుతుండగా అక్కడి నుండి ఈ ప్రాంతాలకు రవాణా ఖర్చు అధికమవుతోందని తెలుస్తోంది. కొబ్బరి చెట్లు ఎక్కువగా ఉష్ణమండల ప్రాంతాలు, పుష్కలంగా వర్షపాతం ఉండే తీర ప్రాంతాల్లోనే బాగా పెరుగే పరిస్థితులు ఉండటంతో వాటి సాగు ఇక్కడ ఎవరూ ఆసక్తి కనబర్చడంలేదు. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందించే కొబ్బరి బొండాలు, టెంకాయలు, ఎండు కొబ్బరి ధరలను కట్టడిచేసి పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది.

# ముగ్గుల పోటీలను సద్వినియోగం చేసుకోండి

## ముత్యాల ముగ్గుల పోటీ కరపత్రాలను విడుదల చేసిన రాష్ట్ర మంత్రి సవిత



ముగ్గుల పోటీ కరపత్రాలు విడుదల చేస్తున్న మంత్రి సవిత

**పెనుకొండ జనవరి 10 (ప్రభాతవార్త)**

పెనుకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి సవితమ్మ తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 14వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో మంత్రి సవితమ్మ సమక్షంలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా పెనుకొండ లోని క్యాంపు కార్యాలయంలో ముత్యాల ముగ్గుల పోటీ కరపత్రాలను శనివారం మంత్రి సవితమ్మ విడుదల చేశారు. సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ సంస్కృతి, మహిళల సృజనాత్మకతను ప్రోత్సహించడమే లక్ష్యమని ఆమె తెలిపారు. ముత్యాల ముగ్గుల పోటీలో పాల్గొనే వారు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకుని టోకెన్ పొందాలని, ముగ్గుల పోటీలు అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి హాజరయ్యే ప్రతి ఒక్కరూ సాంప్రదాయ దుస్తులు ధరించి రావాలని మంత్రి సవితమ్మ కోరారు.

ముత్యాల ముగ్గుల పోటీల బహుమతులు: మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు, అదనంగా, అందంగా ముగ్గులు వేసిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. 14012026 బుధవారం ఉదయం 9.00 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్, పెనుకొండ నన్ను పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. గ్రామీణ కళలు, సంప్రదాయాలను కాపాడే ఈ కార్యక్రమాన్ని అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, మండల కన్వీనర్ ఈశ్వర్ ప్రసాద్, త్రివేంద్ర, కురుబ నంజుండ, సోమశేఖర్, టైలర్ ఆంజనేయులు, టిడిపి నాయకులు అమ్మవారిపల్లి వాసుదేవరెడ్డి, సోమందపల్లి సిసి హరి, సిద్దిలింగప్ప, పరిగి బేబీ, తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌స్పైర్ కప్ విజేతగా నిలిచిన నర్మద వ్యాలీ జట్టు

## - మహిళా క్రికెటర్లను ప్రోత్సాహించడమే ఆర్డిటి లక్ష్యం - డైరెక్టర్ విశాల ఫెర్రర్




విజేత కప్‌తో నర్మద వ్యాలీ జట్టు




అనూషకు చెక్కును అందిస్తున్న అతిథులు

**అనంతపురం సిటీ, జనవరి 10 ప్రభాతవార్త**

ఆర్డిటి క్రీడా మైదానం వేదికగా నిర్వహించిన ఇన్స్‌పైర్ కప్ అండర్-17 బాలికల ఫుట్ బాల్ టోర్నమెంట్ విజేతగా నర్మద వ్యాలీ జట్టు నిలిచింది. మగన్ సింగ్ రాజ్వీ, నర్మద వ్యాలీ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నర్మద వాలీజట్టు 2-1 తేడాతో విజయం సాధించింది. నర్మద వ్యాలీ జట్టులో శాంతిదుర్వే, అంబికా దుర్వేలు ఒక్కో గోల్ చేశారు. మగన్‌సింగ్ రాజ్వీ జట్టులో మంజు కన్వర్ ఒక గోల్ చేశారు. ముగింపు కార్యక్రమానికి ఆర్డిటి ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ భారత మహిళల అండర్-20, 17 జాతీయ జట్ల చీఫ్‌కోచ్ జోసిం అలెగ్జాండర్‌సన్ ఆర్డిటి స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా చీఫ్ కోచ్ జోసిం అలెగ్జాండర్‌సన్ మాట్లాడుతూ.. ఇలాంటి పోటీల వల్ల ప్రతిభావంతమైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. అంతేకాకుండా తమ ఆట తీరును మెరుగుపర్చుకునేందుకు దోహద పడుతాయని పేర్కొన్నారు. ఆర్డిటి డైరెక్టర్ విశాల ఫెర్రర్ మాట్లాడుతూ.. క్రీడల్లో బాలికల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఆర్డిటి ముందుంటుందన్నారు. 2002లో ఇన్స్‌పైర్‌కప్ ప్రారంభించినప్పుడు ఐదు జట్లతో టోర్నీ ప్రారంభమైందని టోర్నీలో పాల్గొనేందుకు జట్లను ఆహ్వానించాల్సిన పరిస్థితి గతంలో ఉండేదన్నారు. నేడు అందుకు భిన్నంగా టోర్నీలో భాగస్వామ్యం అయ్యేందుకు అనేక బాలికల జట్లు ముందుకు వస్తున్నాయని, నేడు 14 జట్లు పాల్గొనడమే ఇందుకు నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా విజేతలకు విన్నర్స్ కప్, రన్నర్స్‌కు రన్నర్స్ కప్ అందజేశారు. అదే విధంగా మాల్దీవులలో జరిగిన అంతర్జాతీయ మ్యాచ్‌లో భారత దేశ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అనూషను ఈ సందర్భంగా సత్కరించి రూ.20వేల చెక్కును పంపిణీ చేశారు. అదే విధంగా 3వ స్థానానికి జరిగిన మ్యాచ్‌లో యూనికార్న్ అనంతపురం స్పోర్ట్స్ మధ్య జరిగిన పోరులో యూనికార్న్ 2-0తో విజయం సాధించి 3వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బెస్ట్ గోల్ కీపర్, బెస్ట్ డిఫెండర్, బెస్ట్ ప్లేయర్, టాప్ స్కోరర్లకు సైతం అవార్డులను అందజేశారు.

# చిరుధాన్యాల ప్రాసెసింగ్‌ను వికేంద్రీకరించాలి

## - ప్రజారోగ్యం కోసం సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టాలి - మిల్లెట్ మేళ ముగింపు సమావేశంలో వక్తలు వెల్లడి








సభలో మాట్లాడుతున్న టింబక్ట్ కలెక్టివ్ సహ వ్యవస్థాపకులు మేరీ, మిల్లెట్ మేళా ముగింపు సందర్భంగా ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు, మాట్లాడుతున్న స్వచ్ఛ కాద్యం వ్యవస్థాపకుడు సతీష్ కుమార్

**అనంతపురం, జనవరి 10, (ప్రభాతవార్త బ్యూరో)**

చిరుధాన్యాల ప్రాసెసింగ్‌ను గ్రామ స్థాయిలో వికేంద్రీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, తద్వారా రైతులు , వినియోగదారులు కూడా ప్రయోజనం పొందుతారని స్వచ్ఛ కాద్యం వ్యవస్థాపకుడు సతీష్ కుమార్ సిఏవి, ధరణి సీఈఓ రమేష్ కుమార్ అభిప్రాయపడ్డారు. అనంతపురంలో మూడు రోజుల పాటు జరిగిన మిల్లెట్ మేళా2026 ముగింపు సభ శనివారం జరిగింది. సభ లో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన పలు రైతుఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పిఓ) డైరెక్టర్ల బోర్డు సభ్యులతో యాక్సియన్ ఫ్రాటర్నా ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వై.వి. మల్లారెడ్డి మాట్లాడుతూ ఎక్కడైతే డైరెక్టర్ల బోర్డు చురుకుగా ఉండి వాటాదారులు తమ ఉత్పత్తులను ఎఫ్‌పిఓకు విక్రయించడం లేదా దాని నుండి ముడిసరుకులను కొనుగోలు చేయడం లాంటి చర్యలు చేస్తున్నారో, అక్కడ వారు విజయవంతంగా లాభాలతో నడుస్తున్నారని అన్నారు. టింబాక్టు కలెక్టివ్ సహ వ్యవస్థాపకురాలు మేరీ వట్టమట్టం మాట్లాడుతూ, అన్ని కాయ కూరలు, పంటలలో జరుగుతున్న కల్తీని హైలైట్ చేస్తూ, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి వ్యవసాయంలో సహజ/సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టడం ద్వారా దీనిని అరికట్టాలని అభిప్రాయపడ్డారు. మాజీ ఐఏఎస్ అధికారి స్మరజిత్ రే భార్య నందితా రే మాట్లాడుతూ వ్యవసాయ పర్యావరణ నమూనాలకు కట్టుబడి, ఉద్యానవన పంటలను వార్షిక చిరుధాన్యాల పంటలతో కలిపి, సేంద్రియ వ్యవసాయం , ఉమ్మడి పచ్చిక బయళ్ల ద్వారా టింబాక్టు కలెక్టివ్ అభివృద్ధి చేస్తున్న 100 ఎకరాల ఉమ్మడి భూములను సందర్శించవలసిందిగా రైతులకు ఆహ్వానం పలికారు. సభలో ఏపీఎంఏఎస్ వ్యవస్థాపకుడు సి.ఎస్. రెడ్డి తదితరులు ఉన్నారు . మిల్లెట్ మేళాలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థలు సుమారు 30 స్టాళ్లను ఏర్పాటు చేశాయి . రైతులతో సహా వివిధ వర్గాల ప్రజలు దాదాపు 1,500 మందికి పైగా ఈ స్టాళ్లను సందర్శించారు. ఇండియా పోస్ట్ ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసిఎఫ్‌పిఓలు తమ చిరుధాన్యాలను తక్కువ ఖర్చుతో ఎలా ఎగుమతి చేయవచ్చో వివరించింది. పలు వ్యవసాయ, ఉద్యానవన డిప్లొమా కళాశాలలు , ఆర్ట్స్ కళాశాలల విద్యార్థులు మిల్లెట్ మేళలో స్టాళ్లను సందర్శించి మూడు రోజుల పాటు జరిగిన ఉపన్యాసాలను వినడం గమనించదగ్గ విషయం..

# పేరూరు ప్రాజెక్టు పనులపై ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులతో సమాలోచనలు



హంద్రీ నీవా అధికారులు, మెగా సంస్థ ప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే పరిటాల సునీత

- స్ట్రక్చర్లు, సబ్ స్టేషన్లు, పెండింగ్ కాలువ పనులు, పంప్ హౌస్‌ల నిర్మాణంపై చర్చ
- సమావేశంలో పాల్గొన్న హంద్రీ నీవా అధికారులు, మెగా సంస్థ ప్రతినిధులు

**అనంతపురం, జనవరి 10, (ప్రభాతవార్త బ్యూరో)**

రాప్తాడు నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా ఉన్న పేరూరు (అప్పర్ పెన్నార్) ప్రాజెక్టుకు నీరందించే పనులు ప్రారంభం దిశగా అడుగులు పడుతున్నాయి. 2018సంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో భూసేకరణ చేసి ఈ పనులు ప్రారంభించారు. అయితే ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి అని ఆరోపణన్నాయి.. పైగా భూమిల్చిన రైతులకు గత ప్రభుత్వం పరిహారం కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే పరిటాల సునీత ఈ పనులు తిరిగి ప్రారంభించే దిశగా అనేక ప్రయత్నాలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుని పలు సార్లు కలిసి దీనిపై విజ్ఞప్తి చేశారు. ఇందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ పనులు ప్రారంభానికి అడుగులు పడుతున్నాయి. తాజాగా ఇందుకు సంబంధించి శనివారం రోజు అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. హంద్రీనీవా ఎస్ఈ స్వరూప్ కుమార్ ఇతర అధికారులతోపాటు మెగా ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు (పేరూరు) వరకు 54కిలోమీటర్లు కాలువ త్రవ్వకంతో పాటు, 4లిఫ్ట్ లు, 112 స్ట్రక్చర్లు, సోమరవాండ్ల పల్లి ప్రాజెక్టు నిర్మాణంతో పాటు ఇతర పనుల గురించి చర్చించారు. రైతులకు చెల్లించాల్సిన పరిహారం గురించి చర్చించారు. ఇందులో ప్రస్తుతం రూ.8.2 కోట్లు రైతులకు చెల్లించేందుకు సిద్ధం చేసినట్టు అధికారులు వివరించారు. బెళుగుప్ప మండలంలో 5కిలోమీటర్లు కాలువ కోసం, కోనంపల్లి దగ్గర 15ఎకరాలు కాలువపల్లి దగ్గర 33ఎకరాలు భూమిని సేకరించాల్సి ఉందన్నారు. 50స్ట్రక్చర్లు పూర్తి కాగా, 62స్ట్రక్చర్లు నిర్మాణం చేయాల్సి ఉందని వివరించారు. 4పంప్ హౌస్ ల పనులు త్వరలో ప్రారంభిస్తామని వివరించారు. అలాగే 132/30కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం 8ఎకరాల పొలం సేకరించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఈ నెలలోనే పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులు ప్రారంభించబోతున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన ఇది ఆలస్యమైందన్నారు. కనీసం రైతులకు భూసేకరణ డబ్బు కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా హామీ ఇచ్చారని.. అందుకే ఈ పనులను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్టు చెప్పారు. జనవరి 20 తర్వాత పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు.



# రాయలసీమ ఉద్యమకారుడు ఇమామ్‌కు ఘన సన్మానం

## - అనంతలో రాయలసీమ మహాసభను నిర్వహించాలని నిర్ణయం




ఇమామ్ ప్రస్థానం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మేయర్ వసీం తదితరులు

**అనంతపురం, జనవరి 10 ప్రభాతవార్త బ్యూరో**

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని జి.ఆర్ ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే భూమన్ కరుణాకర్ రెడ్డి ప్రచురించిన ఇమాం ప్రస్థానం.. పుస్తక ఆవిష్కరణ, ఇమామ్ దంపతులకు ఘన సన్మానం కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. పుస్తకావిష్కరణను వై.విశ్వేశ్వర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే ఆవిష్కరించగా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ రమణ, జిల్లా అధ్యక్షులు జి.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు కృష్ణ, నాయకత్వంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమను నిర్లక్ష్యం చేస్తున్న కారణంగా గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి, ఎం.వి. రమణారెడ్డి, మైసూరా రెడ్డి, గార్ల నాయకత్వంలో నిర్వహించిన పోతిరెడ్డిపాడు పాదయాత్ర తరహాలో రాయలసీమ మహాసభను అనంతపురంలో నిర్వహించాలని, అలాగే అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం పేద ప్రజలకు అండగా నిలబడిన ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఏను పునరుద్ధరించాలని తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్ రెడ్డి, మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి, ఎర్రి స్వామి రెడ్డి, వైయస్సార్సీపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి, బుక్కచెర్ల నల్లపురెడ్డి, మాజీ రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, మాజీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్, ఆత్మా రామిరెడ్డి, ప్రముఖ రచయితలు బండి నారాయణస్వామి, శాంతి నారాయణ, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాదులు ఉమాపతి, సత్యనారాయణ రెడ్డి, సాంబి రెడ్డి, శాంత మూర్తి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సీఈవో భానూజ, కుల్లాయి స్వామి, ఎస్‌టిఎస్‌సి జేఏసీ నాయకులు సాకే హరి, విద్యార్థి నాయకులు చంద్రశేఖర్ యాదవ్, మానవత సలీం మాలిక్, ఆలంబన జనార్ధన, ఇమామ్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని లాంగ్ లీవ్ ఇమామ్.. ..వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలి..మా వాటా మాకు ఇవ్వాలి.. నినాదాలు చేశారు.



సీనియర్ జర్నలిస్ట్ ఇమాం దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

## ఉపాధి పథకం పేరు మార్పు తగదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

హిందూపురం టౌన్ జనవరి 10 ప్రభాతవార్త

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు తగదని కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. శనివారం హిందూపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షానవాజ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షానవాజ్ మాట్లాడుతూ 2005 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, అప్పటి ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్లు ప్రవేశపెట్టారని, ఈ పథకం పేరును ఇప్పటి కూటమి ప్రభుత్వం మార్చడం సరికాదని నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. భారతదేశంలో నిరుపేదలు సొంత గ్రామాలు వదిలి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపోతున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ సొంత గ్రామాలలోని ఉపాధి కల్పించాలని ముఖ్య ఉద్దేశంతో ఈ పథకం ప్రవేశపెట్టిందని వారు తెలిపారు. ఇప్పటి ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. పథకం పేరు మార్పుపై గ్రామస్థాయి నుండి మండల నియోజకవర్గ జిల్లా స్థాయిలో కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదంలో తీవ్రంగా గాయనడిన వ్యక్తిచికిత్స పొందుతూ మృతి

బెలుగుప్ప, జనవరి 10 ప్రభాతవార్త


మృతి చెందిన హనుమంతరాయుడు

కళ్యాణదుర్గం మండలం కురాకుల తోట గ్రామానికి చెందిన హనుమంతు రాయుడు(48) 06.01.2026న సాయంత్రం విడపనకల్లు మండలం కొత్తకోట గ్రామానికి ఊరు జాతరకు వెళ్లి అదే రోజు రాత్రి తిరుగు ప్రయాణంలో బెలుగుప్ప మండల పరిధిలోని గంగవరం గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అవడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళి అడ్మిట్ చేసినారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి 7.15 గంటలకు చనిపోయినాడు. ఈ సందర్భంగా ఉదయం స్టేషన్‌కు పిర్యాది లక్ష్మి (మృతుని భార్య) పిర్యాదు ఇవ్వగ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలియజేశారు.

## ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా ఒకరు మృతి

బ్రహ్మ సముద్రం జనవరి 10 ప్రభాతవార్త


ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి


కాలువలో పడ్డ ట్రాక్టర్ దృశ్యం

మండల పరిధిలోని పోలేపల్లి గ్రామము వద్ద బిటిపి కుడి కాలువలోకి ట్రాక్టర్ అదుపు తప్పి భైరవాణి తిప్ప కుడి కాలువలో పడటంతో కపట లింగంపల్లి గ్రామానికి చెందిన కురుబ మంతేష్ కుమారుడు నితిన్ 16 మృతి చెందడం జరిగింది నితిన్ డ్రైవ్ చేస్తూ అదుపు తప్పి నీటి కాలువులో పడి చెందారు ట్రాక్టర్ ఓనర్ మైనర్ బాలునికి ట్రాక్టర్ ఇవ్వడంతో కంట్రోల్ చేయడం తెలియక బాలుడు మృతి గ్రామస్తులు వాపోతున్నారు పోలీసుల కేసు నమోదు చేసి విచారణ జరుగుతున్నట్లు తెలిపారు

## కే.టీ.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

రాయదుర్గం రూరల్ జనవరి 10 ప్రభాతవార్త


సంబరాల్లో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు

రాయదుర్గం స్థానిక కే.టీ.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సిసి నేతృత్వంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు సాంప్రదాయబద్ధంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు అధ్యాపకులు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా సాంప్రదాయ దుస్తులను ధరించి ముగ్గుల పోటీలు హరి దాసుల వేషధారణ గ్రామీణ ఆటలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు కోలాటం డప్పు నృత్యాలు జానపద గీతాలతో అందరిని ఆకట్టుకున్నారు. ఎన్సిసి క్యాడెట్లు,సంక్రాంతి పండుగ జరుపుకునే విధానాన్ని కళాశాల క్రికెట్ మైదానం నందు చక్కగా ప్రదర్శించి అలరించారు.ఈ సందర్భంగా వారు భోగి మంటలు, సంక్రాంతి రోజు చేసుకునే వంటకాలు అలాగే కనుమ రోజు ఎద్దులకు చేసే పూజలు, హరిదాసు వేషం అన్ని చక్కగా ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శ్రీనివాసులు ఈ కార్యక్రమంలో సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, విద్యార్థిని విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన ఎన్సిసి సి.టి.ఓ మరియు ఎన్సిసి క్యాడేట్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. లక్ష్మీనారాయణ, కళాశాల అధ్యాపకులు కిరణ్ జక్కల, నాగరాజా రెడ్డి, డి నారాయణ జి.కోదండరాములు, ఎం లక్ష్మీనారాయణ, గోవర్ధన్ పాండురంగ, వినోద్ కుమార్, మల్లికార్జున, ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గంలో విషాదం

### అయ్యప్పస్వామి ఆలయ గురుస్వామి వెంకటేశులు మరణం అయ్యప్ప స్వామి భక్తులకు తీరనిలోటు

కళ్యాణదుర్గం జనవరి 10 ప్రభాతవార్త


గురుస్వామి వెంకటేశ్వర్లు

కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన అయ్యప్ప స్వామి గురుస్వామి వెంకటేశులు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచారు. ఈ వార్త తెలియగానే పట్టణం మొత్తం విషాదంలో మునిగిపోయింది. శ్రీ అయ్యప్ప స్వామి గురుస్వామిగా వెంకటేశులు అనేక మంది భక్తులను అయ్యప్ప దీక్షలో మాలాధారణ చేసి , ఆధ్యాత్మిక సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన సేవలు, భక్తి మార్గదర్శనం, భక్తులకు చిరస్మరణీయం. ఆయన ఆకస్మిక మృతి భక్తుల్లో తీరని లోటుగా మారింది. వెంకటేశులు మృతి వార్త తెలుసుకున్న అయ్యప్ప భక్తులు, శ్రేయోభిలాషులు, పట్టణ ప్రముఖులు ఆయన నివాసానికి చేరుకుని నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భక్తులు ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

## హిందూ ధర్మ పరిరక్షణ మన అందరి బాధ్యత

### - కోణ కన్వాశ్రమం పీఠాధిపతి దత్త నందగిరిస్వామి



హిందూ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ రామానందన్

లేపాక్షి, జనవరి 10 ప్రభాతవార్త


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రచార విభాగ్ లక్ష్మణ్

మండల కేంద్రమైన లేపాక్షిలో శనివారం హిందూ సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కోణ కన్వాశ్రమం పీఠాధిపతి దత్త నందగిరిస్వామి, లేపాక్షి ఆలయ చైర్మన్ కరణం రామానందన్, అనంతపురం విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్, సుధా స్రవంతి కూచిపూడి నాట్యాచార్యులు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. అతి ప్రాచీన కాలం నుండి హిందుత్వంపై దాడులు జరుగుతూనే


కార్యక్రమానికి హాజరైన హిందూ సంఘాల నాయకులు

ఉన్నాయన్నారు. ఎన్ని దాడులు జరిగినా హిందుత్వం రోజురోజుకు బలపడుతోందన్నారు. ఛత్రపతి శివాజీ, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీరులు హిందుత్వం, హిందూధర్మం అభివృద్ధికి ప్రాణాలు అర్పించారన్నారు. నేటి ఆధునిక సమాజంలో ప్రతి హింధువు మన ధర్మాలను సంరక్షించుకోవాలన్నారు. ఆర్ఎస్ఎస్ సంస్థ హిందూ సంరక్షణకు చేస్తున్న కృషిని కొందరు మతోన్మాదులు వక్రీకరిస్తున్నట్టు ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర మత ధర్మాలను విమర్శించడం మంచిది కాదన్నారు. ప్రతి గ్రామంలోనూ హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించడంలో ప్రధాన ఉద్దేశం హిందూ ధర్మ సంరక్షణ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి, మండల బిజెపి అధ్యక్షుడు నరసింహమూర్తి, జనసేన మండల నాయకులు బాలాజీ, లోకేష్, బిజెపి నాయకులు బద్రి, దత్త, గోవింద్‌రెడ్డి, నవీన్, నీరుగంటి ఆంజనేయులు, అధిక సంఖ్యలో బిజెపి, ఆర్ఎస్ఎస్ నాయకులు, శివాజీ యువసేన నాయకులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రీడాకారులకు క్రికెట్ కిట్లు పంపిణీ

లేపాక్షి, జనవరి 10 ప్రభాతవార్త


క్రికెట్ కిట్ పంపిణీ చేస్తున్న జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఆనంద్‌కుమార్

మండల కేంద్రమైన లేపాక్షిలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఆనంద్ కుమార్ శనివారం క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. లేపాక్షి ఎస్సి కాలనీకి చెందిన యువ క్రీడాకారులు అవసరమైన సామాగ్రిని ఇవ్వాలని ఆనంద్‌ను కోరారు. ఇందుకు స్పందించిన అధికార ప్రతినిధి ఆనంద్‌కుమార్ తన సొంత ఖర్చుతో ఎస్‌సి కాలనీ యువకులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు తన వంతు కృషి చేస్తున్నానన్నారు. ఇందులో భాగంగానే క్రికెట్ కిట్లను పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యమంలో టిడిపి నాయకులు అంగడి అంజి, రమేష్, ఎస్‌సి కాలనీ యువత పాల్గొన్నారు.

## అటెండెన్స్‌లో ఆబ్సెంట్ పేరుతో నోటీసులా

### - ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన నోటీసులను వెనుక్కు తీసుకోవాలి - ఎంఆర్‌సి వద్ద ఆందోళనకు దిగిన గోరంట్ల మండలం ఉపాధ్యాయ సంఘాలు


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాలు

గోరంట్ల, జనవరి 10 ప్రభాతవార్త

ఈనెల 7వ తేదీన సాంకేతిక కారణాల వల్ల మరియు పని ఒత్తిడి వల్ల ఒక పూట అటెండెన్స్ వేయనందుకు గాను ఉపాధ్యాయులను వేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేదంటే తీవ్రస్థాయిలో స్పందిస్తామని ప్రభుత్వ అధికారుల నిరంకుశ ధోరణి మానుకోవాలని అన్ని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం గోరంట్ల మండల ఎంఆర్‌సి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో గోరంట్ల మండల అన్ని ఉపాధ్యాయ సంఘాల సభ్యులు మరియు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చాలా సందర్భాలలో సాంకేతిక కారణాల వల్ల అటెండెన్స్ యాప్ సరిగా పనిచేయకపోవడం వల్ల, పరీక్షల సమయంలో ఉపాధ్యాయులకు ఉండే పని ఒత్తిడి వల్ల ఒక్కోసారి పాఠశాల పని వేళలు ముగిశాక కూడా చాలామంది ఉపాధ్యాయులు దాదాపుగా పాఠశాలలో అరగంట పాటు ఆలస్యంగా ఉన్నా కూడా అటెండెన్స్ వేయడం మర్చిపోవడం జరుగుతుంది. ఇలాంటి సందర్భంలో ఒక పూట మాత్రమే అవుట్ టైం అటెండెన్స్ వేయలేదని సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 441 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం చాలా హేయమైన చర్యగా భావిస్తున్నామని తెలిపారు. ఒక వారం లేదా ఒక నెలపాటు అటెండెన్స్ రిపోర్ట్ తీసి నిజంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నవారిపై చర్యలు తీసుకుంటే ఉపాధ్యాయుల తరఫున కూడా స్వాగతిస్తామని ప్రభుత్వ అధికారులను కోరారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఒక డిఏ మాత్రమే ఇచ్చి, బకాయిలు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో పెట్టిన తరుణంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల యొక్క దృష్టి మరల్చడానికి ఇలాంటి దుర్మార్గపు చర్యలు తీసుకోవడం చాలా తీవ్రంగా పరిగణిస్తున్నామని, ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు జారీ చేసిన నోటీసులను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండలం ఉపాధ్యాయులు వేముల దామోదర్‌రెడ్డి, పాల్యం మురళి, నీలం అశోక్, సురేష్, బాలకృష్ణ, విద్యాసాగర్, నరేంద్రరెడ్డి, నగేష్, రామాంజనేయులు, శేషాద్రి, కిష్టప్ప, నాగభూషణ, రాధా రమణ, రవీంద్ర, మహేష్, కృష్ణమూర్తి, రామచంద్ర, అంజినప్ప, లక్ష్మీరాంనాయక్, ఆంజనేయులు, నరేష్, కిష్ట, గంగరాజు, లక్ష్మినారాయణ, వెంకటరమణనాయక్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహం ఏర్పాటుకు రూ. 10 లక్షల విరాళం

హిందూపురం జనవరి 10 ప్రభాతవార్త


విరాళం అందిస్తున్న వైసీ కార్తీక్

పట్టణంలోని సూగూరు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణం మైదానంలో ఏర్పాటు చేస్తున్న 45 అడుగుల ఏకశిల అభయాంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటు కోసం పది లక్షల రూపాయలను వైసీ కార్తీక్ విరాళంగా శనివారం అందజేశారు. దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయం పాలకమండలి వైసీ చంద్రశేఖర్ కు ఆయన కుమారుడైన వైసీ కార్తీక్ విరాళాన్ని అందించారు. బెంగళూరుకు చెందిన వైసీ ఆర్చిడ్ హోమ్ కంపెనీ యజమానులయి న కార్తీక్, అవినాష్ రెడ్డి, అఖిలేష్ రెడ్డి సంయుక్తంగా ఈ భారీ మొత్తాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏకశిలా విగ్రహం రాతి బేస్మెంట్ కు ఈ డబ్బును ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రామకృష్ణప్ప, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ హరినాథ్, దేవేంద్రప్ప, కిషోర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కనేకల్లులో రూ.10 వేల జరిమానా

కనేకల్ జనవరి 10 ప్రభాతవార్త :


అధిక ధరలకు సిగరెట్లు విక్రయం

పట్టణంలో అధిక ధరకు సిగరెట్ ప్యాక్‌ను విక్రయించిన వ్యక్తిపై లీగల్ మెట్రోలజీ చట్టం ప్రకారం అధికారులు శనివారము కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు సిగరెట్లు అమ్మినందుకు సంబంధిత వ్యక్తి నుంచిరూ.10,000 అపరాధ రుసుమును ఆన్‌లైన్ ద్వారా వసూలు చేసినట్లు లీగల్ మెట్రోలజీ ఇన్స్పెక్టర్ వై.జి. శంకర్ వెల్లడించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వ్యాపారులపై ఇకపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రోలజీ ఇన్స్పెక్టర్ వై.జి. శంకర్ హెచ్చరించారు. వినియోగదారుల హితాన్ని దృష్టిలో ఉంచుకొని తనిఖీలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

## వెనక నుండి లారీని ఢీకొన్న కారు

డి.హిరెహాళ్ జనవరి 10 ప్రభాతవార్త


లారీని ఢీకొని బోల్తాపడ్డ కారు

ముందు వెళ్తున్న లారీని వెనకవైపు నుండి కారు ఢీకొన్న ప్రమాదంలో కారు బోల్తాపడినట్లు ఎస్.ఐ. గురుప్రసాద్ రెడ్డి చెప్పారు. ఎస్.ఐ. అందించిన వివరాలు మేరకు శనివారం డి.హిరెహాళ్ మండలం హిర్దెహాళ్ గ్రామ శివారులో జరిగిన ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారని ఎస్సై తెలిపారు. బళ్లారి నుండి రాయదుర్గం వెళుతున్న లారీని డ్రైవర్ అకస్మాత్తుగా కుడి వైపుకు తిప్పడంతో ఆ లారీ వెనక వెళుతున్న కారు వెనక వైపు నుండి గుద్దుకున్నట్లు ఎస్.ఐ.చెప్పారు. ప్రమాదం నుండి స్వల్ప గాయాలతో బయటపడిన కారు యజమాని మరెగౌడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు ఎస్.ఐ.తెలిపారు.

## నేడు శ్రీ సత్యసాయి విద్యార్థుల వార్షిక క్రీడా సమ్మేళనం


రీహార్సల్స్ చేస్తున్న విద్యార్థులు



పుట్టపర్తి టౌన్, జనవరి 10, ప్రభాతవార్త

పుట్టపర్తి లోని ప్రశాంతి నిలయంలో నేడు సత్యసాయి విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులచే వార్షిక క్రీడా సమ్మేళనం నిర్వహించనున్నారు. ప్రతి ఏటా జనవరి 11న ఈ క్రీడా సనిమేళం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం సత్యసాయి హిల్ వ్యూ స్టేడియం వేదికగా ఈ క్రీడా సమ్మేళనం జరగనుంది. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రశాంతి నిలయం క్యాంపస్, శ్రీమతి ఈశ్వరమ్మ హై స్కూల్, ప్రైమరీ స్కూల్, బృందావన్ క్యాంపస్, నంది గిరి క్యాంపస్, అనంతపురం మరియు వైట్ ఫీల్డ్ మెడికల్ అండ్ సైన్స్ విద్యార్థులు వేలాదిగా ఈ క్రీడా సమ్మేళనంలో పాల్గొననున్నారు. శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మరియు శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు అన్ని పూర్తి చేశారు శ్రీ సత్య సాయి హిల్ వ్యూ స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సుమారు నెలరోజుల రోజుల నుండి విద్యార్థులు ఈ క్రీడా సమ్మేళనానికి కఠిన సాధనలు నిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు మార్చి ఫాస్ట్ తో ఈ కార్యక్రమం ప్రారంభమై విద్యార్థులు అనేక విన్యాసాలను మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

## టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

డి.హిరెహాళ్ జనవరి 10 ప్రభాతవార్త


టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ బృందం

టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి 13 మోటర్ సైకిల్ వాహనాలకు చలానాలు విధించడం జరిగిందని ఎస్.ఐ. గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం డి.హిరెహాళ్ మండలం జాతరకల్లు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టి రికార్డులు లేని మోటార్ సైకిళ్లకు అపరాద రుసుం విధించినట్లు ఎస్సై చెప్పారు. అనంతరం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఇరువురు పైన కేసు నమోదు చేయడం జరిగిందని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న ఒక మోటార్ సైకిల్ వాహనదారుడి పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు.

## సబ్ ట్రెజరీ కార్యాలయం మరోక చోటికి మార్పు..!

### - మొదలైన రికార్డులు, ఫర్నీచర్ తరలింపు ప్రక్రియ

ఉరవకొండ, జనవరి 10 ప్రభాతవార్త


సబ్ ట్రెజరీ కార్యాలయంలోని రికార్డులను తరలిస్తున్న దృశ్యం

ఉరవకొండ సబ్ ట్రెజరీ (ఉప ఖజానా) కార్యాలయం మార్పు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. బ్రిటీష్ కాలం నాటి స్థానిక రెవెన్యూ కార్యాలయం (తహశీల్దార్) పాత భవనంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ క్యాంపు కార్యాలయంను నూతనంగా ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా ఆ భవనంలోనే ఒకవైపున ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని స్థానిక వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల ముందుగల ఇందిరా మహిళా మండలి ఆవరణంలోగల ప్రభుత్వ భవనంలోని మార్పు చేస్తున్నారు. ఈక్రమంలోనే శనివారం కార్యాలయం తరలింపు పనులు మొదలవ్వగా కార్యాలయంలోని రికార్డులు, ఫర్నీచర్ ఇతరత్రా వస్తువులను ఆటోల్లో తరలించారు. మరో వారం రోజుల్లో కార్యాలయంను పూర్తిగా మార్పు చేయనున్నట్లు సమాచారం.

## సీపీఐ 100 ఏళ్ల వేడుకలకు తరలిరండి

### -జిల్లా కార్యదర్శి నారాయణస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణస్వామి

గుంతకల్లు, జనవరి 10 ప్రభాతవార్త

ఈనెల 18న ఖమ్మంలో జరగనున్న సీపీఐ 100 ఏళ్ళ వేడుకలకు వేలాదిగా తరలిరావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ 11 ఏళ్ల పాలనలో దళిత, గిరిజన మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై కోర్టు ఆవరణంలోనే దాడి జరగడమే అందుకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మాట తప్పారన్నారు. నిరుద్యోగ భృతి 3వేలు, 19 ఏళ్లు పైబడి 49 సంవత్సరాలలోపు ఉన్న మహిళలకు నెలకు 1500 రూపాయల ఊసే లేదని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు గోవిందు, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి సాకే గోపీనాథ్, మండల కార్యదర్శి రాము రాయల్, సహాయ కార్యదర్శి రామాంజనేయులుయాదవ్, గుత్తి, పామిడి మండలాల నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి సవితమ్మ సమక్షంలో యువ నాయకుడు నిమ్మల శ్రీధర్ జన్మదిన వేడుకలు

### కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సవిత


మంత్రి సవిత సమక్షంలో నిమ్మల శ్రీధర్ జన్మదిన వేడుకలు

పెనుకొండ జనవరి 10 (ప్రభాతవార్త)

గోరంట్ల మండలం టిడిపి యువ నాయకులు నిమ్మల శ్రీధర్ జన్మదినం వేడుకలు మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో పెనుకొండలో ఘనంగా జరిగాయి. శనివారం పెనుగొండ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నందు గోరంట్ల టీడీపీ యువ నాయకులు నిమ్మల శ్రీధర్ జన్మదిన వేడుకలు మంత్రి సమక్షంలో నిర్వహించారు.ఈసందర్భంగా మంత్రి సవిత కేక్‌కట్‌చేసి నిమ్మల శ్రీధర్‌కు స్వీట్‌తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిమ్మల శ్రీధర్ మాట్లాడుతూ మంత్రి సవితమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

## స్వచ్ఛ తాడిమర్రి నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికులదే కీలక పాత్ర

### ఎంపీడీవో వెంకటరంగారావు

తాడిమర్రి జనవరి 10 (ప్రభాతవార్త)


స్వచ్ఛ తాడిమర్రి బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు, నాయకులు


పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీవో వెంకటరంగారావు, సర్పంచ్ బండారు బాలమ్మ

మండల కేంద్రంలో శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛ తాడిమర్రి కార్యక్రమము ఎం ఎంపీడీవో వెంకట రంగారావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమంలో తాడిమర్రి గ్రామ పంచాయతీలో స్వచ్ఛ తాడిమర్రి స్వాగతం బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపీడీవో వెంకట రంగా రావు చేతుల మీదుగా పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు సంక్రాంతి కానుకల అందజేసి వారిని సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో విజయ శేఖర్ నాయుడు తాడిమర్రి గ్రామ సర్పంచ్ బండారు బాలమ్మ, పంచాయతీ కార్యదర్శి రిజ్వానా బేగం, ఆత్మకూరు సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, సచివాలయ సిబ్బంది, జనసేన మండల కన్వీనర్ మోహన్, పక్కిర్ రెడ్డి, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## నేడు వడ్డే ఓబన్న రాష్ట్ర స్థాయి జయంతోత్సవం

అనంతపురం న్యూటౌన్, జనవరి 10 ప్రభాతవార్త

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ జిల్లా కేంద్రంలోని లలితకళా పరిషత్తులో ఉదయం 10 గంటలకు వడ్డే ఓబన్న రాష్ట్రస్థాయి జయంతోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ జయంతోత్సవానికి ప్రభుత్వము రూ.5 లక్షల రూపాయలను రెండు రోజుల క్రితం విడుదల చేసింది.

06ATP27_06ATP27.qxd 10-01-2026 PM 11:07 Page 1



# ధర్మవరంలో సత్యకుమార్ ఆధ్వర్యంలో 14,15 సంక్రాంతి సంబరాలు

### హాజరు కానున్న సినీనటుడు సాయికుమార్, గజల్ శ్రీనివాస్

ధర్మవరంటౌన్, జనవరి 10 ప్రభాతవార్త



బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు

మనసంస్కృతి మనభవిష్యత్తు అన్న సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 14,15 తేదీలలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ హరీశ్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంబరాలకు సినీనటుడు సాయికుమార్, ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ లు హాజరవుతున్నారన్నారు. ఈ వేడుకలలో వీరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారన్నారు. గాలిపటాలపోటీలు, గోలీలు, బొంగరాలు వంటి సంప్రదాయ ఆటలు, జిల్లా కోడి ప్రదర్శనలు, గంగిరెద్దులు, హరిదాసు వంటి ప్రజా కళారూపాలు, ముగ్గులపోటీలు, పల్లెటూరు ప్రత్యేక పిండివంటల ప్రదర్శనలు నిర్వహించబడతాయన్నారు. ఈ సంబరాలకు ధర్మవరం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ప్రజలందరూ కుటుంబసభ్యులతో రావాలన్నారు.

# వక్కలిగల సమస్యల పరిష్కారానికి సమైక్యంగా పోరాడాలి

### - రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మినారాయణ

అగళి, జనవరి 10 ప్రభాతవార్త



రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ను సన్మానిస్తున్న దృశ్యం

వక్కలిగల సమస్యల పరిష్కారానికి వక్కలిగలంతా సమైక్యంగా కలిసి పోరాడితేనే ఆంధ్రప్రదేశ్ వక్కలిగ సంఘం కార్పోరేషన్ చైర్మన్ లక్ష్మినారాయణ అన్నారు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా మధుగిరి తాలూకా వసికెర సమీపంలో లక్ష్మిదేవి దేవస్థానం ఆవరణలో మధుగిరి నియోజకవర్గ కుంచశ్రీ గిరి ట్రస్టు వారి ఆధ్వర్యంలో శ్రీ హనుమంత స్వామీజీ అధ్యక్షతన నూతన కమిటీ ఎన్నిక, నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్కలిగ సంఘం చైర్మన్ లక్ష్మినారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వక్కలిగలు ఏ రాష్ట్రంలో ఉన్నా వక్కలిగ సమస్యలపై ఉమ్మడిగా ఉద్యమించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్రం మధుగిరి శిర సంఘం అధ్యక్షులు హాజరయ్యారు. మడకశిర నుంచి నర్సేగౌడ, రాజశేఖర్, కుల బాంధవులు హాజరయ్యారు. కుంచిటిగ, వక్కలిగల సమస్యలపైన సుదీర్ఘ ఉపన్యాసం శ్రీ హనుమంత స్వామీజీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కుంచిటిగ వక్కలిగలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# అంబేద్కర్ స్మృతి వనంలో ఎస్ఐకి సన్మానం

అమరాపురం జనవరి 10 ప్రభాతవార్త



బదిలీపై వెళుతున్న ఎస్సైకి సన్మానం చేస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని అంబేద్కర్ స్మృతి వనం నందు అమరాపురం ఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీ పైవెళ్తున్నఎస్సై ఇషాక్ బాషాకు అంబేద్కర్ స్మృతి వనం సభ్యులు ఘనంగా శనివారం శాలువా పూలమాలలతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ స్మృతి వనం అధ్యక్షుడు ఉదుగూరు శివకుమార్, గౌరవ అధ్యక్షులు ఏ.నారాయణప్ప, జయకుమార్, సీనియర్ నాయకులు పేలుబండ ప్రసాద్, ఉదుగూరు తిప్పేస్వామి, చిట్టనడుకు మహాలింగప్ప,చెన్నప్ప, సురేష్, రామచంద్రప్ప, రఘు, దేవరాజు, ఓంకార్ ,నాగరాజు, చంద్ర, హనుమంతరాయ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్మృతి వనంనాయకులు ఏ. నారాయణప్ప, శివకుమార్, జయకుమార్ లు మాట్లాడుతూ మండలంలో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ తన వంతు కర్తవ్యాన్ని బాధ్యతగా నిర్వహించి ప్రజల మన్ననలను పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్మృతి వనం భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఇలాంటి అంబేద్కర్ స్మృతి వనం ఎక్కడ లేదని దీన్ని బాగా అభివృద్ధి చేయాలని బదిలీపై వెళుతున్న ఎస్ఐ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దళిత సోదరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

బత్తలపల్లి, జనవరి 10 ప్రభాతవార్త



మాల్యవంతంలో కార్మికులను సన్మానిస్తున్న నేతలు అధికారులు

అవరిశుభ్రత, దుర్వాసనను సైతం తట్టుకొని వ్యర్థాలను తొలగిస్తూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడుతున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని మండల అధికారులు,



బత్తలపల్లిలో పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

కూటమి నేతలు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన బత్తలపల్లి, మాల్యవంతం పంచాయతీ కేంద్రాలలో పనిచేస్తు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములైన పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. మాల్యవంతం పంచాయతీలో టిడిపి కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో క్రిష్టప్ప,పంచాయతీ కార్యదర్శి అమర్నాథ్, పరేష్,కుంటాల రాము, సద్దల లక్ష్మీనారాయణ, అనంతయ్య,వెంకటేష్ తదితరులు కార్మికులకు పూలమాలలు, శాలువాలతో సన్మానించగా మండల కేంద్రమైన బత్తలపల్లిలో క్లస్టర్ ఇన్చార్జ్ నెట్టెం రమణ,ఉప సర్పంచ్ కోటి గోపీనాథ్, పంచాయతీ కార్యదర్శులు నారాయణస్వామి, ముత్యాలనాయుడు తదితరులు హార్స్ డే కార్మికులకు పూలమాలలు వేసి సన్మానించారు. అంతకుమునుపు పలుచోట్ల స్వచ్ఛ క్రాంతి స్వాగత బోర్డులను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో కార్మికులు వీరనారప్ప, నారాయణస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

# రైతు వద్ద నగదు దోపిడి

గుత్తి, జనవరి 10 ప్రభాతవార్త

మండలంలోని ఊబిచెర్ల గ్రామ సమీపంలో శనివారం రామాంజనేయులు అనే రైతు వద్ద గుర్తుతెలియని ఇద్దరు నగదును దోపిడీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామానికి చెందిన రామాంజనేయులు తన వ్యవసాయ పనులు నిమిత్తం గుత్తి మండలం మార్నేపల్లికి ద్విచక్ర వాహనంలో వస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇరువురు సదరు రైతును అటకాయించారు. అతని వద్ద ఉన్న 5500 రూపాయల నగదును దోపిడీ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వార్త పత్రిక వార్తలను అందించే సాధనం మాత్రమే కాదు ప్రజల స్వరం

### వార్త క్యాలెండర్ ఆవిష్కరణలో ఏపీ ఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ

రొళ్ల జనవరి10 ప్రభాతవార్త:



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకుల దృశ్యం

వార్త పత్రిక వార్తలను అందిం చే సాధనం మాత్రమే కాదు ప్రజల స్వరం అని ఏపీ ఐఐసీ డైరెక్టర్ రామ కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని స్థానిక రైతు సహకార కేంద్రంలో జాతీయ వార్త దినపత్రిక 2026 సంవత్సర నూతన క్యాలెండర్లను స్థానిక టిడిపి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ ఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ..వార్త దినపత్రిక నిష్పక్షపాతమైన వార్తలతో ప్రజల విశ్వాసాన్ని సంపాదించిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో వార్తా పత్రిక ఒక శక్తివంతమైన సమాచార మాధ్యమంగా పనిచేస్తుందని.ప్రజల సమస్యలను,ఆశయాలను, అవసరాలను ప్రభుత్వానికి చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.ప్రభుత్వం తీసుకునే విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించి తెలియజేయడంలో కూడా పత్రిక వారధిగా నిలుస్తుందన్నారు. గ్రామస్థాయి సమస్యల నుండి రాష్ట్ర, జాతీయ స్థాయి అంశాల వరకు ప్రజల గళాన్ని పత్రిక బలంగా వినిపిస్తుందన్నారు. నిర్లక్ష్యానికి గురైన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడంలో పత్రిక ప్రభావవంతమైన పాత్రను పోషిస్తుందన్నారు.ఇదే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని, వాటి వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించడం ద్వారా అపోహలను తొలగిస్తు ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగవ స్థంభంగా పత్రిక వ్యవహరించుతూ, ప్రజలు ప్రభుత్వం మధ్య నమ్మకాన్ని పెంపొందిస్తుందన్నారు. చివరగా కన్వీనర్ ఈరన్న మాట్లాడుతూ..నిజాయితీగల వార్తలతో, నిర్మాణాత్మక విమర్శలతో ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచుతు అదే సమయంలో ప్రజలను చైతన్య వంతులుగా మార్చి, హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన కల్పిస్తుందన్నారు. అందువల్ల పత్రిక కేవలం వార్తలు అందించే సాధనం మాత్రమే కాకుండా, ప్రజల స్వరం ప్రభుత్వానికి చేరవేసే వారధిగా,ప్రభుత్వ ఆలోచనలను ప్రజలకు చేరవేసే దూతగా పనిచేస్తుందని కొని ఆడారు. ఈ కార్యక్రమంలో మండల సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, కన్వీనర్ ఈరన్న, ఏపీ ఐఐసి డైరెక్టర్ రామకృష్ణ, గుడ్డగురికి పంచాయితీ మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, యువ నాయకులు మండల యూనిట్ ఇంచార్జ్ మీసేవ వెంకటేష్, ఆనంద్, భరత్, రాజు, నాగరాజ్ , స్థానిక విలేకరులు తిమ్మరాజు,సన్నతిమ్మప్ప, భీమ్రాజ్ పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

వజ్రకరూరు జనవరి 10 ప్రభాతవార్త



కందుల కొనుగోలు కేంద్రంను ప్రారంభిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ప్యాపిలి నాగేంద్ర తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని కెఎం ఆర్ గోదాములో నాఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కందుల కొనుగోలు కేంద్రాన్ని పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు, లైనింగ్ పనులను ప్రారంభించి నీటి సామర్థ్యాన్ని పెంచిందన్నారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు అందించారన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు డ్రిప్పును అందించి వేలాది ఎకరాలలో పంటలు సాగయ్యేలా కృషి చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రైతుల సంక్షేమానికి మంత్రి, పార్టీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు విశేష కృషి చేస్తున్నారన్నారు. రైతు సంక్షేమంతో పాటు ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నిటిని నెరవేరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు మాజీ సర్పంచులు దస్తగిరి, ఎర్రి స్వామి, జనసేన పార్టీ మండల కన్వీనర్ అచ్చునాల కేశవ్, మాజీ ఎంపీటీసీ నాగన్న, నాయకులు ఆంజనేయులు, నజీర్, పెద్దన్న, రామాంజనేయులు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు దుప్పట్లు పంపిణీ




దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి, జనవరి 10 ప్రభాతవార్త

గుత్తి ఫోర్ట్ రైల్వే స్టేషన్లో శనివారం రైల్వే శాఖ ఐఓడబ్ల్యూ నాగేశ్వరరావునాయక్ ఆటో డ్రైవర్లకు దుప్పట్ల పంపిణీ చేశారు. వీటిని సమితి గౌరవ సలహాదారులు రంగనాథరావు సౌజన్యంతో అందచేశారు. ఈ సందర్భంగా వారికి గుత్తి కోట సంరక్షణ సమితి ప్రచురించిన క్యాలెండర్లను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, సమితి అధ్యక్షుడు విజయభాస్కర్చౌదరి, నాయకులు గంగాధర్కుమార్ , నాగరాజ్, నిజాం, కన్నా, దస్తగిరి, శివ, నాగార్జున, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

# మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా గొంగటి రమేష్

తాడిమర్రి జనవరి 10 (ప్రభాతవార్త)



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆదినారాయణ యాదవ్

పిన్నదరి గ్రామానికి చెందిన గొంగటి రమేష్ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షునిగా నియమించారు. ఈ నియామక పత్రాన్ని ఓ బి సి మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మరియు సత్యసాయి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు గుద్దూరు అనిల్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నామీద నమ్మకం ఉంచి నాకు ఓబిసి మోర్చ మండలం అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించినందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ కు, ఆదినారాయణ యాదవ్ ,మండల కన్వీనర్ దేవర రామ్మోహన్ కు,పార్టీ పార్టీ సీనియర్ నాయకులకు, బిజెపి మండల నాయకులకు, ధన్యవాదాలు తెలుపుతున్నాను. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరిని కలుపుకొని పనిచేస్తానని తెలిపారు.

# గవిమఠం సహాయ కమీషనర్పై అసత్య ఆరోపణలు తగవు

### - ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డివిజినల్ సభ్యుడు కొకుంట్ల రవి

ఉరవకొండ, జనవరి 10 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న కొకుంట్ల రవి

గవిమఠ సంస్థానం సహాయ కమీషనర్, మేనేజర్ కె.రాణిపై ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డివిజినల్ సభ్యుడు కొకుంట్ల రవి వాపోయారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. ఉత్తరాధికారి సహాయ కమీషనర్పై కుల వివక్షత చూపడమే కాకుండా అసత్య ఆరోపణలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సహాయ కమీషనర్ రాణి ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఉద్యోగులతో మమేకమై మెరుగైన పనితీరు కనబరుస్తున్నారన్నారు. ఉత్తరాధికారి ఆదోని, తుంకూరులో బాడుగలు వసూళు చేయడం లేదని గతంలో ప్రాంతీయ ఉప కమీషనర్కు లేఖ రాశారని అందులో భాగంగానే ఆర్జేసి, జిల్లా ఏసీ గవిమఠాన్ని సందర్శించి సహాయ కమీషనర్కు నోటీసులు ఇచ్చి వివరణ అడిగారన్నారు. 98 సంవత్సరాల వయసుగల పీఠాధిపతిపై హఠాత్తుగా ఉత్తరాధికారికు ప్రేమ పుట్టుకొచ్చిందని ఎద్దేవా చేశారు. వికలాంగురాలైన దళిత సామాజికవర్గానికి చెందిన సహాయ కమీషనర్, వయో వృద్ధులైన పీఠాధిపతిని ఇబ్బందులకు గురి చేసి ఇప్పుడు తన పనులకు అడ్డుపడుతున్నారని సహాయ కమీషనర్పై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఉత్తరాధికారి ఇలాగే నడుచుకొంటూపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కొకుంట్ల రవి హెచ్చరించారు.

# 14వ వార్డులో ముందస్తు సంక్రాంతి వేడుకలు

గుంతకల్లు, జనవరి 10 ప్రభాతవార్త



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న నారాయణస్వామి

పట్టణంలోని 14వ వార్డులో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వార్డు ఇన్చార్జ్ అశోక్కుమార్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సోదరుడు, మండల ఇన్చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరు సంక్రాంతి వేడుకలు ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు, కౌన్సిలర్ మెహరున్నీసాబేగం, నాయకులు ఫజులు, గుజరి మహమ్మద్ఖాజా, మాతృనాయక్, నందీశ్వర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రామలింగప్ప మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

గుంతకల్లు, జనవరి 10 ప్రభాతవార్త



రామలింగప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

రియల్ ఎస్టేట్ వ్యాపారి తలారి రామలింగప్ప గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ శనివారం వారి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ముక్కన్నగారి రామాంజనేయులు, కురుబ చంద్రశేఖర్, శివప్ప, ముక్కన్నగారి మధు, తదితరులు ఉన్నారు.

# దేశం కోసం జీవించడం గర్వకారణం



మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి, జనవరి 10 ప్రభాతవార్త

క్రమశిక్షణతో, త్యాగభావంతో, బాధ్యతతో దేశం కోసం జీవించడం గర్వకారణమని మాజీ సైనికులు పేర్కొన్నారు. స్థానిక గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ సైనిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత సైన్యంలో సేవలు అందించి పదవీవిరమణ పొందిన మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ దూదేకుల షేకన్నా, సుబేదార్ నాయబ్, రామమూర్తి, కళాశాల కరస్పాండెంట్ వికె పద్మావతి, ఎండి రఘునాథ్రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ నమ్రత, ఏఒ ఇంతియాజ్బాషా, తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ కమ్మ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



కాకతీయ కమ్మ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న కమ్మ కులస్తులు

ధర్మవరంటౌన్ జనవరి 10 ప్రభాతవార్త

కమ్మ కుల బాంధవులు శనివారం ధర్మవరం పట్టణంలోని కాకతీయ కమ్మ సేవా సంఘం కార్యాలయంలో 2026 కాకతీయ కమ్మ సంఘం క్యాలెండర్ను ధర్మవరం కమ్మ కులస్తులు అందరూపాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దోనాదుల నాగశేషు, అమర కేశవ నాయుడు లు మాట్లాడుతూ...... ఎంతో మంది పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్న కమ్మ కులస్తులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. మన కులస్తులందరూ ఐకమత్యంగా ఉండి మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమ్మ సంఘ సభ్యులు పాలడుగు సురేష్, దోనాదుల విజయ్ కుమార్, రాంపురం శీనా , రాయపాటి శివ, సురేష్ , బొజ్జన్న , ధనుంజయ చౌదరి , నారప్ప చౌదరి, ఆదినారాయణ, రామానాయుడు , అజయ్ చౌదరి , తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం

ఉరవకొండ, జనవరి 10 ప్రభాతవార్త



లక్ష్మినరసింహస్వామి పల్లకీ మోస్తున్న కార్యనిర్వహణ అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి

జిల్లాలో ప్రసిద్ధ చెందిన ఉరవకొండ మండలం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి దేవస్థానంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం పుష్యమాసం సప్తమి శనివారం సాయంత్రం సాంప్రదాయం ప్రకారం లక్ష్మినరసింహస్వామి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.యన్.తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీరి ఘనంగా ప్రధానాలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనం దీవెనల్లో నిమ్మల శ్రీధర్

### - టిడిపి నేత నిమ్మల శ్రీధర్ జన్మదిన వేడుకలు సందర్భంగా సేవా కార్యక్రమాలు -ఆలయాల్లో పూజలు, అనాధ ఆశ్రమంలో అన్నదానాలు, నేత కార్మికునికి ఆర్థిక సాయం -వేడుకల్లో పాల్గొన్న టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, టిడిపి ప్రముఖులు

గోరంట్ల, జనవరి 10 ప్రభాతవార్త



కేక్ కట్ చేసి నిమ్మల శ్రీధర్కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి సవితమ్మ

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సమాజ సేవకులు, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అనుచరుడు నిమ్మల శ్రీధర్ జన్మదిన వేడుకలు జనం దీవెనల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలో శనివారం తెలుగుదేశం పార్టీ నాయకుడు నిమ్మల శ్రీధర్ జన్మదిన వేడుకల్లో పెద్దఎత్తున తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. గోరంట్ల మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బాలకృష్ణచౌదరి, తెలుగు



మండల కన్వీనర్ సమక్షంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

యువత మండల అధ్యక్షులు అచ్యుత్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్రెడ్డి, మాజీ సర్పంచు ఉత్తమరెడ్డి, జనసేన జిల్లా కార్యదర్శి సురేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దేవాంగం శ్రీనివాసులు, రవీంద్రనాయక్, మైనార్టీ నాయకులు అజంతుల్లా, ఉమర్ఖాన్, సింగిల్ విండో డైరెక్టర్ నబీరసూల్, కలీం, సుబహాన్, పసుపులేటి శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్చార్జ్ నరేష్యాదవ్, మరెడ్డిపల్లి నరసింహులు, నేత సంఘం నాయకులు పవన్, మునిస్వామి, బండా మహేష్, కర్ణ సోము, మాజీ సర్పంచు చక్రానాయక్, తదితర వందలాదిమంది నిమ్మల శ్రీధర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల సందర్భంగా గోరంట్ల పట్టణంలోని ప్రధాన వీధుల్లో భారీ ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు చేపట్టారు. నిమ్మల శ్రీధర్ జన్మదిన వేడుకల్లో కురుబ మహేంద్ర, మామిడికాయల హరి, రోహిత్, సింగిరెడ్డిపల్లి శ్రీకాంత్యాదవ్, డీలర్ రమేష్, మల్లేష్, వీర మహిళ కావేరి, తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐని సన్మానించిన టిడిపి నాయకులు

అమరాపురం జనవరి 10 ప్రభాతవార్త



ఎస్సైని సన్మానిస్తున్న టిడిపి నాయకులు దృశ్యం

అమరాపురం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.కె వలీభాషను శనివారం తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కృష్ణమూర్తి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి నాగరాజ్, మాజీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, సింగల్ విండో డైరెక్టర్ దాదా పీర్, అమరాపురం జడ్పిటిసి పిఆర్ నరసింహమూర్తి, నియోజకవర్గ ఎస్సి సెల్ ఉపాధ్యక్షుడు చెన్నప్ప తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం ప్రశాంతతకు నిలయమైన అమరాపురం మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ని ఘనంగా సన్మానం చేశారు

# శ్రీవారి సన్నిధిలో సంక్రాంతి సందర్భంగా 14న ముగ్గుల పోటీలు

### - లక్ష్మినరసింహస్వామి ఆలయ ఈఓ సి.ఎన్.తిరుమలరెడ్డి

ఉరవకొండ, జనవరి 10 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి

మండల పరిధిలోని పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో నిర్వహించే సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 14వ తేదీన ఉదయం 11 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి 'సి.ఎన్.తిరుమలరెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ పోటీల్లో స్థానిక మహిళలు, యువతులు, బాలికలు పాల్గొనవచ్చున్నారు. సంక్రాంతి సంస్కృతి, సంప్రదాయం, భక్తిభావం ప్రతిబింబించేలా వేసిన ముగ్గులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 3,000 రూపాయలు, రెండవ బహుమతిగా 2,000 రూపాయలు అందజేస్తామన్నారు. సంప్రదాయాలను పరిరక్షిస్తూ, సృజనాత్మకతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోటీల్లో పాల్గొనదలచినవారు ఈనెల 11వ తేదీ నుండి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో వివరించారు.

04ATP13_04ATP13.qxd 10-01-2026 PM 10:50 Page 1



# విద్యుత్ చార్జీలు మరింత చవక

## - విరివిగా పవన విద్యుత్ సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం అడుగులు - కేంద్ర ప్రభుత్వం నుండి సంపూర్ణ సహాయ సహకారాలు



టవర్ నిర్మాణానికి అనుమతి ఇచ్చిన భూ యజమానికి పరిహారం అందిస్తున్న దృశ్యం

**అనంతపురం, జనవరి 10 ప్రభాతవార్త బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం కాలుష్యం లేని విద్యుత్ ఉత్పత్తికి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టును వెలుగులోకి తీసుకొచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ఈ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంపూర్ణంగా ఉపయోగించుకుని ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలను అందించాలన్న లక్ష్యంతో పనులను వేగవంతం చేయిస్తోంది. ఇందులో భాగంగా రెజోనియా పవర్ ట్రాన్స్మిషన్ సంస్థ ఇప్పటికే పనులను చురుకుగా ముందుకు తీసుకెళ్తోంది. ఇలా ఉత్పత్తి చేసిన విద్యుత్తును అనంతపురం జిల్లా కనేకల్ మండలం ఎల్బీనగర్ నుండి కడప జిల్లా చింతకొమ్మదిన్నె వరకు తీసుకు వెళ్ళేలా ట్రాన్స్ ఫర్మేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం కూడా భూసేకరణ వేగవంతం చేసింది. అధికార యంత్రాంగం భూసేకరణలో కలెక్టర్ నిర్ణయించిన ధరకే పరిహారాన్ని రైతులకు నేరుగా డీడీల రూపంలో అందజేస్తుండడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కలెక్టర్ నిర్ణయించిన పరిహారం దాదాపు భూమి యొక్క విలువ కంటే ఎక్కువగా ఉండడం కేవలం రైతు నుండి భూమిని వాడుకోవడానికే అనుమతి పత్రంపై సంతకం పెట్టించుకుని భూమిపై పూర్తిహక్కును రైతుకే ఉండడంతో రైతులు ఆనంద పడుతున్నారు. టవర్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన కొంతమంది రైతులకు భూమిపై తమకు హక్కు లేకుండా పోతుందన్న అపోహాలు ఉండటం వాటిని నివృత్తి చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని రకాలు ఏర్పాట్లు చేస్తోంది. ట్రాన్స్ ఫర్మేషన్ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తయితే చౌక ధరకే నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందించడంతో ప్రజలపై విద్యుత్ భారం తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# సంక్రాంతి సంబరాలు, క్రీడలతో సంప్రదాయ వేడుకల పోస్టర్ విడుదల

## ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణశర్మ



పోస్టర్‌లు విడుదల చేస్తున్న ఇంచార్జ్ కలెక్టర్

**అనంతపురం కలెక్టరేట్ జనవరి 10 ప్రభాతవార్త**

జిల్లాలో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలు , క్రీడలతో సంప్రదాయ వేడుకలు క్రీడా పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులతో కలిసి నగరంలోని తన క్యాంపు కార్యాలయం నందు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడలను ప్రోత్సహించే దిశలో భాగంగా సంక్రాంతి సంబరాలు క్రీడలతో సంప్రదాయ వేడుకలు క్రీడా పోటీల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమన్వయ భావన పెంపొందించేలా చేపట్టడం జరుగుతుందని అన్నారు. క్రీడా పోటీలు సోమవారం ఉదయం 8 గంటల నుండి అనంతపురం జిల్లా పీటీసీ మైదానంలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. తాడాట మహిళలకు తొక్కుడు బిళ్ళ, పురుషులకు కర్ర సాము, ఎడ్ల పెంకులాట తాడు లాగుడు గాలిపటాలు పాల్గొనవచ్చునని ఇన్చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ చెప్పారు. కావున జిల్లాలోని ఆసక్తి గల క్రీడాకారులు ప్రకటనలో పేర్కొన్న సూచనలను అనుసరించి పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. 08554315632 నంబర్‌ను సంప్రదించవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిణి ఎస్.ఎమ్ మంజుల, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, క్రీడా ప్రాధికార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ హయాంలో రైతులకు ఏమి న్యాయం చేశారో చెప్పాలి

## - కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత



కందులను తూకం వేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు, జనవరి 10 ప్రభాతవార్త**

వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఏమి న్యాయం చేశారో చెప్పాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత డిమాండ్ చేశారు. రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామంలో ఆమె కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెటింగ్, వ్యవసాయశాఖల అధికారులు, రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సమీపంలోని చీనీ తోటను పరిశీలించారు. దీంతోపాటు రాప్తాడు, బుక్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకారపరపతిసంఘాల (పీఏసీఎస్) క్యాలెండర్లను ఆయా అధ్యక్షులతో కలిసి విడుదల చేశారు. అధ్యక్షులతోపాటు ఇతరసభ్యులు ప్రజలు, రైతులనుంచి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. గతఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు ఎంత ఇబ్బందిపడ్డారో అందరికీ తెలుసన్నారు. వేరుసెనగ, కంది రైతులు నష్టపోతే ఏం పరిహారం ఇచ్చారని ప్రశ్నించారు. ప్రతి రైతు నుంచి ఎకరాకు గరిష్టంగా నాలుగు క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయడం జరుగుతోందని.. గత ఏడాది ధర రూ.7550 ఉండగా..ఇప్పుడు రూ.8వేలతో మార్క్ ఫెడ్ ద్వారా కందులను కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన కందుల నాణ్యతను తేమ శాతాన్ని స్వయంగా పరీక్షించి అధికారులు సూచించిన విధంగా కందిని రైతులు సిద్ధం చేసుకుని తీసుకురావాలని రైతులకు సూచించడంతోపాటు .. నిబంధనల పేరుతో రైతులను ఎవరూ ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు కూడా ఎమ్మెల్యే సునీత సూచించారు.

# గుండెపోటుతో పోలీస్ కంట్రోల్ రూం ఎస్సై మోహన్ ప్రసాద్ మృతి

## - ఎస్సై మృతి పట్ల ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన జిల్లా ఎస్.పి శ్రీ పి.జగదీష్ - పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు



పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం, జనవరి 10 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం జిల్లా పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్న మోహన్ ప్రసాద్ గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం విధినిర్వహణలో ఉన్న ఎస్సైకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు.

అయిన ప్పటికేమృతి చెందారు. ఎస్.ఐ మృతి పట్ల జిల్లా ఎస్.పి శ్రీ పి.జగదీష్ ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. విధి నిర్వాహణలో అంకితభావంతో పనిచేసే సిబ్బంది అకాలమరణం పొందడం బాధాకరమ న్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎస్.ఐ మోహన్ ప్రసాద్ 1990 బ్యాచ్‌కు చెందిన వారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పోలీస్ లాంఛనాలతో స్థానిక జెఎన్టీయు రోడ్డులోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పీ.సి.ఆర్ సి.ఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై మాణిక్యం, పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సూర్యకుమార్, సుధాకర్ రెడ్డి, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కోడి పందేలు, జూదాలు, అసాంఘిక కార్యకలాపాలను సహించేది లేదు

## జూద క్రీడలు వద్దు సంప్రదాయ క్రీడలే ముద్దు - జిల్లా ఎస్పీ పి. జగదీష్

**అనంతపురం కలెక్టరేట్ జనవరి 10 ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో కోడి పందేలు, పేకాట, గుండాట, తదితర అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ పి. జగదీష్, తెలిపారు. సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, చట్టవిరుద్ధమైన జూదాలకు దూరంగా ఉండాలని జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సాంప్రదాయ క్రీడలైన కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ వంటి క్రీడలను నిర్వహించుకుని పండుగను ఆరోగ్యకరంగా జరుపుకోవాలని సూచించారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, శివార్లు తదితర ప్రాంతాల్లో కోడి పందాలు, జూదాలు, గుండాట నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఎవరైనా కోడి పందాలు ఆడినా, వాటిని ప్రోత్సహించినా లేదా నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని



జిల్లా ఎస్పీ పి. జగదీష్

హెచ్చరించారు. జూదాల నియంత్రణకు , కోడి పందేలు, జూదాలు జరిగే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించాలి, కోడి పందేల స్థావరాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలి, గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించి జూదాలు జరగకుండా అవగాహన కల్పించాలి, గతంలో కోడి పందాలు, జూదాల్లో పట్టుబడిన వారిని బైండోవర్ చేయాలి జిల్లా ఎస్పీ పి జగదీష్ పోలీసుల ను ఆదేశించారు. కోడి పందేలకు ఉపయోగించే కత్తులు తయారు చేసే వారు, సరఫరా చేసే వారు, స్థలాలు కేటాయించే వారిని గ్రామస్థాయిలో గుర్తించి వారిని కూడా బైండోవర్ చేయాలిపండుగ రోజులలో కోడి పందాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బృందాలతో నిఘా ఏర్పాటు చేయాలి... ముఖ్యంగా డ్రోన్లు వినియోగించాలిసంప్రదాయ సంక్రాంతి క్రీడలు ప్రజల్లో సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందిస్తాయని... చట్టవిరుద్ధమైన జూదాలు కుటుంబాలు, సమాజాన్ని నష్టపరుస్తాయని తెలిపారు. అలాంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. 100 , 112 కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం చేరవేయాలని విజ్ఞప్తి చేశారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదేలేదు.. ఎస్పీ

## - తప్పు చేస్తే ఎవరిని వదిలిపెట్టం - నేరస్తుల ఆస్తులను కోర్టులకు అటాచ్ చేస్తాం - రౌడీ షీటర్లను హెచ్చరించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్.. - రావులచెరువు గ్రామంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమం..







గ్రామస్తులతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్‌పి, కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసు బృందం ,రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్పి

**ధర్మవరం రూరల్ జనవరి 10 ప్రభాతవార్త**

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని...తప్పు చేస్తే ఎవరిని వదిలిపెట్ట మని...చట్టం పరిధి దాటితే... చట్ట రిత్యా చర్యలు తప్పదని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ హెచ్చరించారు. శనివారం శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం మండల పరిధిలోని సమసాత్మకమైన రావులచెరువు గ్రామంలో 120 మంది పోలీసు సిబ్బందితో కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ, డీఎస్పీ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ గ్రామంలోని పరిసర ప్రాంతాలలో తనిఖీ చేసి, గతంలో హత్య కేసుల్లో ఉన్న ఫ్యాక్షనిస్టులు, రౌడీ షీటర్ల తో పాటు రౌడీయిజం, గొడవలు, నేర ప్రవర్తన కలిగిన పాత నేరస్తులపై శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల ఇళ్లను పరిశీలించారు. అనంతరం జిల్లా ఎస్పీ గ్రామస్తుల సమావేశంలో మాట్లాడుతూ.. సత్ప్రవర్తనతో నడుచుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్యాక్షన్ వద్దు... ప్రశాంతమైన జీవనం గడపాలని ప్రజలకు సూచించారు. చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోకూడదని, మీ ప్రవర్తనే మీ పిల్లలకు బంగారు భవిష్యత్తుకు దోహద పడుతుందన్నారు. గతాన్ని స్మరించుకొని ఎలాంటి గొడవలకు పాల్పడినా... ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని వివరించారు. చట్టాన్ని ఉల్లంఘించినా, గొడవలు పడిన చూస్తూ ఊరుకోమని అటువంటి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో డ్రోన్ కెమెరాలు, బాడీ వోర్న్ కెమెరాలు, మొబైల్ స్కానింగ్ డివైసెస్, ఫింగర్ ప్రింట్ స్కానర్లు వినియోగించారని తెలిపారు. దీంతోపాటు నేరాలకు పాల్పడిన నేరస్తుల ఆస్తులను కోర్టులకు అటాచ్ చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. నెంబర్ ప్లేట్లు, రికార్డులు లేని 40 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ద్విచక్ర వాహనాలకు సంబంధించిన రికార్డులు చూపించిన అనంతరం వాటిని అప్పజెపుతామని తెలిపారు. గ్రామాలలో అందరూ చట్టానికి లోబడి ఉండాలని, రాజకీయంగా, కులాలపరంగా, ఎక్కడ కూడా గొడవలు పడకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ప్రధాన ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని... ఎవరైనా ఎక్కడైనా గొడవలు పడితే అందులో రికార్డు అవుతాయని... అందులో నేను లేను అనే తప్పించుకునే అవకాశం ఉండదన్నారు. ఎలాంటి గొడవలు జరగకుండా అందరూ కలిసి మెలిసి ప్రశాంతంగా జీవించాలని ఎస్పీ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐలు ప్రభాకర్, శ్రీధర్ , ఎస్సై రాజశేఖర్, ఆర్ ఐ రవికుమార్, స్పెషల్ పార్టీ పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రయాణికులతో కిటకిటలాడిన ఆర్టీసి బస్టాండు

## -సంక్రాంతి సెలవులతో బస్సుల కోసం ఎగబడిన జనం -రద్దీకి అనుగుణంగా బస్సులు తిప్పడంలో అధికారయంత్రాంగం విఫలం





**అనంతపురం జనవరి10 ప్రభాతవార్త**

.ప్రయాణికుల రద్దీతో ఆర్టీసి బస్టాండు కిటకిటలాడింది. సంక్రాంతి సెలవులు శనివారం నుంచి ప్రభుత్వం ఇవ్వడంతో కళాశాలల విద్యార్థులు, పాఠశాలల వున్న హాస్టల్ విద్యార్థులు తమ లగేజీలు తీసుకుని పెద్ద ఎత్తున అనంతపురం బస్టాండుకు చేరుకున్నారు. పండుగ వేళ హాస్టల్‌లో వున్న చిన్న పిల్లలను



తీసుకెళ్లాడానికి ఆయా గ్రామీణ ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు నగరానికి చేరుకుని లగేజీతో పాటు పిల్లలను తీసుకెళ్లడానికి వేలాది మంది బస్టాండుకు వచ్చారు. ఈ తరుణంలో సాధారణ ప్రయాణికులతో పాటు పండుగ సెలవులు రావడంతో బస్టాండు ఆవరణంతో పాటు డిపో ఎదుట వున్న ఖాళీ స్థలంలో సైతం ప్రయాణికులు వేచి వుండి బస్సులు రాగానే, ప్రయాణికులు కూడా దిగడానికి కూడా అవకాశం లేకుండా సీట్లకోసం బస్సు కిటికీలల్లో బ్యాగులు, టవళ్ల వంటి వాటిని వేయడానికి పరుగులు తీశారు. కొందరు అద్దె బస్సు డ్రైవర్లు వేగంగా వెళ్లడంతో బస్సుల వెంబడి విద్యార్థులు, యువకులు పరుగులు తీసుకుంటూ వెళ్లి సీట్ల కోసం ఎగబడ్డారు. ఒకానొక దశలో ఎక్కడ బస్సు టైర్ల కిందపడతారో అన్న భయం డ్రైవర్లలో నెలకొనే దుస్థితి ఏర్పడింది. ఎంత వారించినా వినకుండా బస్సుల వెంబడి పరుగులు తీస్తుండడం పట్ల ఆర్టీసి అధికారుల్లో సైతం ఆందోళన నెలకొంది. అయితే పోలీసులు సైతం ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా బస్టాండు లోపలికి ఆటోలను పంపకుండా బయటనే ప్రయాణికీలను దించేయడం వల్ల కొంత ఊపిరి పీల్చుకునే పరిస్థితి. బస్టాండులో లోపలికి, బయటకు వచ్చే ముఖద్వారాలతో పాటు మయూరి హోటల్ సర్కిళ్లలో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించడం వల్ల ఎక్కడా ట్రాఫిక్ జామ్‌కాకుండా చర్యలు తీసుకోవడంతో వాహనాల రాకపోకలు సజావుగా వెళ్లాయి. రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు తిప్పడలో అధికారయంత్రాంగం విఫలమైందని చెప్పవచ్చు. ఏది ఏమైనప్పటికి బస్టాండు లోపల, ఫ్లాట్‌ఫాంల ముందు, డిపో ఆవరణంతో పాటు ఎక్కడా ఖాళీ స్థలం లేకుండా ప్రయాణికులతో కిటకిటలాడడం, బస్సులు కూడా ఒకొనొక దశలో ఫ్లాట్‌ఫామ్‌ల వద్దకు వెళ్లలేని దుస్థితి నెలకొంది.

# రైల్వే ట్రాక్ సిగ్నలింగ్ వ్యవస్థ పనుల సమీక్ష

## గుంతకల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా

**గుంతకల్ రైల్వే జనవరి 10 ప్రభాత వార్త**

గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలోని జక్కలచెరువు–వేములపాడు సెక్షన్‌లో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ ప్రారంభానికి సంబంధించిన నాన్ ఇంటర్‌లాకింగ్ (వి) పనులపై తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ సందర్భంగా సంబంధిత శాఖాధికారులతో కలిసి పనుల పురోగతి, భద్రతా ఏర్పాట్లు మరియు కమిషనింగ్‌కు సంబంధించిన స్థితిగతులను సమీక్షించారు. గుంతకల్ డిఆర్ఎం గుప్త రైల్వే స్టేషన్ పరిశరాలను పరిశీలించి ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచాలని స్థానిక అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిఎస్టి చంద్రశేఖర్ మరియు డిఓఎం పూర్ణచంద్రరావు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే సిగ్నెల్ వ్యవస్థ ను తనిఖీ చేసిన డిఆర్ఎం గుప్తా

# ఘనంగా ఉద్యమ నేత ఉపాధ్యాయుడు కోనా కులశేఖర్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం





కోనా కులశేఖర్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమంలోని పలు దృశ్యాలు





**అనంతపురం, జనవరి 10 ప్రభాతవార్త బ్యూరో**

ఉపాధ్యాయ ఉద్యమనాయకుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోనా కులశేషకర్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా గుత్తి రోడ్డులోని బివికెఆర్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఘనంగా సత్కారం, సన్మానాలు జరిగాయి. కులశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయునిగా ఉపాధ్యాయ సంఘం నేతగా చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఒకవైపు ఉపాధ్యాయునిగా విద్యార్థులకు మంచి బోధన అందిస్తూనే మరోవైపు ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం రాజీలేని పోరాటాలు చేశారని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. కులశేఖర్‌రెడ్డి సన్మాన కార్యక్రమానికి రాయలసీమలోలని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయ సంఘాల నేతలతోపాటు బంధుమిత్రులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన కోనాకుల శేఖర్‌రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తనతోపాటు గత రెండు మూడు దశాబ్దాలుగా పనిచేసిన ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను శాలువాలతో సత్కరించి వినూతన కార్యక్రమానికి తెర తీశారు. ఈ సందర్భంగా కోనా కుల శేఖర్‌రెడ్డి జీవిత విశేషాలు ఉద్యమ తీరుపై ఒక పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.ఎల్.విజయకృష్ణరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షులు గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, అనంతపురం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి, మానవతా రక్తదాతల బృందం కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్ రెడ్డి తదితరనాయకులు ప్రజాసంఘాల నాయకులు వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు హాజరయ్యారు. ఈకార్యక్రమానికి కోనాకుల శేఖర్‌రెడ్డితో పాటు పని చేసిన ఉపాధ్యాయ సంఘాల నేతలు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున హాజరై కోనా కుల శేఖర్‌రెడ్డితో తమ అనుబంధాన్ని చేసిన సేవలను కొనియాడారు. అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, వై.విశ్వేశ్వర్‌రెడ్డి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నేతలు మాట్లాడుతూ.. కోనా కుల శేఖర్‌రెడ్డి ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం రాజీలేని పోరాటాలు చేశాడని, ఉపాధ్యాయ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచాడని అభిప్రాయ పడ్డారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయునిగా పని చేసే సమయంలో దాతలసహకారంతో గతంలో స్కూల్ భవనాల నిర్మాణం కోసం, స్కూళ్లలో మౌలిక సదుపాయాల సాధన కోసం ఎంతో కృషి చేసినట్లు వారు అభిప్రాయ పడ్డారు. ఉపాధ్యాయ సంఘ నేతగా పని చేసినప్పటికీ ఒక స్కూల్‌లో మాత్రం విద్యార్థుల అభ్యున్నతి కోసం టీచర్‌గా ఎంతో కృషి చేశాడని, కుల శేఖర్‌రెడ్డి చేసిన సేవలు వెల కట్టలేనివన్నారు. రాబోయే కాలంలో ఉపాధ్యాయునిగా పదవీ విరమణ చేసినప్పటికీ సమాజ సేవలో కీలకంగా మారారని పలువురు విజ్ఞప్తి చేశారు.